క్లుప్తంగా

ఆర్‌బీకేలు.. వ్యవసాయ బడులు..



మాట్లాడుతున్న ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి: ఆర్‌బీకేలు(రైతు భరోసా కేంద్రాలు) వ్యవసాయ బడులు అని, వాటి ద్వారా విత్తనాలు ఎరువులు సరఫరా చేయడమే కాకుండా రైతులకు సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా అందించడం జరుగుతోందని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. బుధవారం మండలంలోని కారాడ ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులు, రైతులతో సమావేశమైన ఆయన సస్యరక్షణ చర్యలకు వ్యవసాయ సహాయకులు సహాయమందిస్తారన్నారు. రైతులు కూడా ఆర్‌బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, వైస్ ఎంపీపీ బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



సీసీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుదర్శనరావు

వంగర: మండలంలోని కింజంగి ఆర్‌అండ్‌బీ కాలనీలో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు బుధవారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.8 లక్షల నిధులతో తొలుత సీసీ కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జిపురం వెంకటేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేత బెజ్జిపురం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు



గార్రాజుచీపురుపల్లిలో రైతుకు ఇచ్చిన కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం: ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సాయిరాం అన్నారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన పొన్నాడ దాలినాయుడు తన పంట పొలంలో వేసిన 180 కొబ్బరి మొక్కలను ఆయన తొలుత పరిశీలించి, అనంతరం గ్రామంలోని పలువురు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న పండ్ల మొక్కల వివరాలను వెల్లడించారు. 14 రకాల జాతులకు చెందిన మొక్కలను ఉచితంగా అందిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు



మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని ఎంఈఓ తిరుమలప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన వంట నిర్వాహకులు వండుతున్న వంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా కొన్ని రూ.కోట్లను మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, ఈ నేపథ్యంలో నాణ్యమైన, రుచికరమైన ఆహారం పిల్లలకు అందివ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మెనూ ప్రకారం వంటలు చేసి, వారికి వడ్డించాలన్నారు. ఇంట్లో మాదిరిగానే ఆహారంపై మూతలు పెట్టాలన్నారు. నాణ్యతలో తేడాలు వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

10 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఖండ్యాం గ్రామానికి చెందిన గుటివాడ సత్యంను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు.

మెంటాడ: అక్రమంగా మద్యంసీసాలు తరలిస్తున్న మండలంలోని పిట్టాడకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 17 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సిద్ధార్థ తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోతుల రవికుమార్ బుధవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



పాల్తేరులో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పాల్తేరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలని, అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. పథకాల ద్వారా పొందిన లబ్ధితో ఎంతోమంది స్వయం ఉపాధి సాధించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే ఎవరు ఏం మంచి చేశారో ప్రజలకు బాగా తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమని, మరోసారి సీఎం జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీటీసీ వంగపండు దివ్య, సర్పంచ్ యు.వివేక తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అర్జీదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసుల అందజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంతోమందికి జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ సేవలతో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. గతంలో వీటిలో ఏ ఒక్కటి కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఇంటి వద్దకే వాటిని అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబాడ గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, ఎంపీడీఓ నాగమణి కలిసి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతు భరోసా కేంద్రం భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఆర్‌బీకే శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కారాడ గ్రామంలో రూ.21 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు బాగుండడం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపిస్తుంటారని, అందుకే ఆయన రైతులకు కష్టం లేకుండా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. రైతు భరోసా పథకం దగ్గర నుంచి రైతు భరోసా కేంద్రం, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అన్నదాతకు అనేక మేలులు చేస్తున్నారన్నారు. రైతు భరోసా పథకం కింద సాగుకు సాయంగా ఏటా నగదు అందిస్తోందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట విక్రయించుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. మరోవైపు సచివాలయంలోని వీఏఏల ద్వారా సాగులో అధిక దిగుబడికి సలహాలు సూచనలు అందేలా చూస్తున్నారన్నారు. వీటితో పాటు వలంటీర్ల ద్వారా ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదు చేయించడం, సకాలంలో పథకాలు అందేలా చేయడం వంటివి చేస్తున్నారన్నారు. గతంలో ఏ రైతుకు ఎరువులు, విత్తనాలు కావాలన్నా మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, గ్రామంలో రైతులకు సాగుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందరరావు, వైస్ ఎంపీపీ డి.జ్యోతి, పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ రాజగోపాల్, సర్పంచ్ సరస్వతీసంజీవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠాలపై శాశ్వత హక్కు

రేగిడి: గ్రామాల్లోని గ్రామకంఠం స్థలాలకు సంబంధించి, శాశ్వత హక్కు కల్పిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ప్రతీ గ్రామంలో సర్వే సిబ్బంది రెవెన్యూ రికార్డుల ప్రకారం స్థలాలు గుర్తించి, ఆ స్థలాలకు సంబంధించిన యజమానులకు భూ హక్కు పత్రాలు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు, సర్వే డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామానికి చెందిన సతివాడ రాంబాబు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను సర్పంచ్ అప్పారావు, వైఎస్సార్ సీపీ నేత మామిడి వేణుగోపాలనాయుడు చేతులమీదుగా బుధవారం అందజేశారు. మిగతా సాయం నామినీ బ్యాంకు ఖాతాలో త్వరలోనే జమ అవుతుందని వారు తెలిపారు.

వలంటీర్‌కు ఆర్థికసాయం..

బొబ్బిలి: అనారోగ్యం కారణంగా విజయనగరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గొల్లపల్లి వలంటీర్ నాగరాజుకు బొబ్బిలి పదో వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తుట్ట తిరుపతిరావు రూ.5 వేలను ఆర్థికసాయంగా బుధవారం ఆస్పత్రికి వెళ్లి, అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇంటింటికీ ‘సంక్షేమ’ ఫలాలు

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే కంబాల జోగులు



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గడిముడిదాం పంచాయతీ, సీఎస్‌ఆర్ పురంలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడం విస్మరించిందన్నారు. ఇప్పుడు అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం ఎన్నికల హామీల్లోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇచ్చిన మరెన్నో హామీలను ఇచ్చి, అమలు చేసిందన్నారు. గతంలో టీడీపీ నాయకులు నీరు–చెట్టు పథకం పేరిట రాష్ట్ర ఖజానాను దోచుకున్నారని విమర్శించారు. అటువంటి వారికి అధికారం ఇస్తే రాష్ట్ర భవిష్యత్ అంధకారమవుతుందని దుయ్యబట్టారు. ఇప్పటివరకు ఈ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైఎస్సార్ సీపీ వంగర మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, సర్పంచ్ జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, తహసీల్దార్ ఎస్కే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

- మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు

బొబ్బిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించిన ఆయన ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి, ఇంకెన్ని నిర్మాణాలు పూర్తి కాలేదు, ప్రారంభించని ఇళ్ల నిర్మాణాలు ఎన్ని అని ఆరాతీశారు. ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చిన లబ్ధిదారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా, నిర్మాణ సామగ్రి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఎవరైనా ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించకపోతే వారి ఇళ్ల పట్టాలను రద్దు చేసి, అర్హులైన కొత్త వారికి ఇస్తే బాగుంటుందన్నారు.

పరామర్శ



తెర్లాం: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కంబాల జోగులు



కృష్ణ మాస్టారు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ ఇటీవల దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు ఆయన కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కలిసి బుధవారం పరామర్శించారు. కృష్ణ మాస్టారు లేనిలోటు తీర్చలేనిదని, ధైర్యంగా ఉండాలన్నారు. గ్రామస్తులు కూడా సంయమనం పాటించి, ఆయన ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కృష్ణ మాస్టారు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. ఎమ్మెల్యేల వెంట వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తెర్లాం, బొబ్బిలి మండలాల జేసీఎస్ కన్వీనర్లు సత్యనారాయణ, దామోదర్ తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరిదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రాజాం: స్థానిక మల్లికార్జున కాలనీలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ తిరువీధి చేపట్టారు. రాజాం పట్టణంతో పాటు రాజాం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

కలాసీల కూలి రేట్లు పెంచాలి

రాజాం సిటీ: స్థానిక బజార్‌లో పనిచేస్తున్న లోడింగ్, అన్‌లోడింగ్ కలాసీల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలాసీలతో సమావేశమైన ఆయన కూలి రేట్లు పెంచకుండా యజమానులు గత నాలుగేళ్లుగా తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు పెంచమన్నా వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారన్నారు. తక్షణమే కూలి రేట్లు పెంచకపోతే పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలినాయుడు, రమణ, శ్రీను, రాంబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్‌ల పంపిణీ

వంగర: స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో కర్నూలుకు చెందిన కిసాన్ ఆగ్రో ప్రొడక్ట్స్ ద్వారా రైతులకు రెయిన్‌కోట్‌లు బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని 227 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని 2,740 మంది రైతులకు వీటిని ఒక్కొక్కటి రూ.150 చొప్పున అందజేయడం విశేషం. వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు వర్షంలో తడవకుండా ఇవి ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో అందజేసినట్లు ఏపీఎం బాసిన గోవిందరావు తెలిపారు.

వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.భాస్కరరావు



రామభద్రపురం: వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కరరావు

రామభద్రపురం: ప్రజలకు వైద్యసేవలందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.భాస్కరరావు సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆయన రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజుకు ప్రసవాలు ఎన్ని అవుతున్నాయి.. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారా లేదా.. ఎన్‌సీపీ నమోదు, గర్భిణులు, చిన్నారుల నమోదులు ఎలా అవుతున్నాయన్న విషయాలను ఆరాతీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి, సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రామభద్రపురంలో అన్ని పారామీటర్స్ నమోదుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తోందని, ఆ కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఉండి, ప్రజలకు సక్రమంగా వైద్యసేవలందించేలా చూడాలన్నారు. ప్రభుత్వం కొన్ని రూ.కోట్లు ఖర్చు చేసి, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. అలాగే సరిపడ వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు మందుల కొరత లేకుండా చేస్తోందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల పనితీరు బాగోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, పనితీరు మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు తప్పనిసరిగా స్థానికంగా ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రాబోయే రోజుల్లో వెల్‌నెస్ సెంటర్లలో కూడా ప్రసవాలు జరిగేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో 172 రకాల మందులు, 63 రకాల వైద్యపరీక్షలు నిర్వహించేలా చూసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఎక్కువ శాతం పారామీటర్స్ నమోదు చేసిన పీహెచ్‌సీకి రూ.లక్షను ప్రభుత్వం అందిస్తోందని, ఆ నిధులతో ఆస్పత్రి అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా..

బాడంగి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని వాడాడ పీహెచ్‌సీ, కోడూరులో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను ఆయన బుధవారం పరిశీలించారు. తొలుత కోడూరులో పర్యటించిన ఆయన అక్కడి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం వాడాడ పీహెచ్‌సీని సందర్శించిన ఆయన రోజువారీ పీహెచ్‌సీకి వస్తున్న ఓపీ, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని, ఆస్పత్రికి వెళ్తే ఎటువంటి రోగమైనా తగ్గిపోతుందన్న బలమైన నమ్మకాన్ని ప్రజలకు ఇవ్వాలన్నారు. ఆయన వెంట డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంఈఓ ఎ.జోగినాయుడు తదితరులు ఉన్నారు.